www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 30 సెప్టెంబర్ 2023

పంపిణీకి సిద్ధంగా ఇంటి పట్టాలు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలో నాలుగో విడత ఇంటి పట్టాలను పంపిణీకి సిద్ధం చేసినట్లు తహశీల్దారు ధనుంజయులు తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో డిప్ ద్వారా 70 మందికి ఇంటి స్థలాల కేటాయింపుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన సుమారు 30 మంది లబ్ధిదారుల చేత తహశీల్దారు డిప్ తీయించి ఇంటి స్థలాల నెంబర్లను కేటాయించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించడం కోసం 1505 ఇంటి పట్టాల ఫైల్స్ సిద్ధం చేసి ఉంచామన్నారు. ఇందులో పీలేరు పట్టణ శివారులోని ఎపిఐఐసి లే అవుట్‌లో నాలుగో విడతగా లబ్ధిదారులకు ఇవ్వడానికి 1178 ఇంటి పట్టాలు కూడా ఉన్నాయని తెలియజేశారు. పట్టాల ముద్రణ సమయంలో తప్పిపోయిన 256 పట్టాలను ముద్రించడానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, వీఆర్వోలు శిల్ప, కవిత, ఎర్రయ్య, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్ ద్వారా ఇంటి నంబర్లను కేటాయిస్తున్న తహశీల్దార్

చిన్న పరిశ్రమలకు చేయూతనిచ్చేనా!

యూనిట్‌కు 15 శాతం సబ్సిడీ - అక్టోబర్ నుంచి నూతన పాలసీ

ఇండస్ట్రియల్ నూతన పాలసీ చిన్న పరిశ్రమలకు చేయూతనివ్వడం సందేహాలకు తావిస్తోంది. పెట్టుబడి రాయితీ, జగనన్న బడుగు వికాసం స్కీముల కింద చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన మేరకు సబ్సిడీలను ప్రకటించింది. గత పాలసీ తరహాలోనే సబ్సిడీలు ఉన్నప్పటికీ వాస్తవంగా పరిశీలిస్తే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదేళ్లపాటు లభించే ఆర్థిక ప్రయోజనాలను కుదించినట్లు తెలుస్తోంది. యూనిట్ వ్యయానికి మించి లభించే ప్రయోజనాల్ని యూనిట్ వ్యయానికి సమానంగా చేసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ మొదటి వారంలో నూతన పాలసీ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలపై ఇండస్ట్రియల్ నూతన పాలసీ చిన్న, సూక్ష్మ, పెట్టుబడి రాయితీ స్కీములపై గణనీయమైన ప్రభావం చూపనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1231 పెట్టుబడి రాయితీ, చిన్న, సూక్ష్మ పథకాల యూనిట్లలో ఒసి, బిసిలకు 15 శాతం, ఎస్‌సి, ఎస్‌టి లకు రూ.45 శాతం సబ్సిడీతో రూ.85.16 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. ఇందులోని 1,130 ఎస్‌సి, ఎస్‌టి యూనిట్లకు రూ.77. 05 కోట్లు రాయితీ రూపంలో రీయింబర్స్ చేయడం తెలిసిందే. తాజా పరిశ్రమల పాలసీలో పెట్టుబడి రాయితీ పథకం యూనిట్‌దారునికి 15 శాతం సబ్సిడీతో రూ.20 లక్షలు ప్రయోజనం చేకూరనుంది. ఒసి, బిసి మహిళలకు అదనంగా మరో రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షలు సబ్సిడీ లభించనుంది. కరెంటు యూనిట్‌కు రూపాయి చొప్పున వెసులుబాటు లభించనుంది. ఐదేళ్లపాటు యూనిట్ కార్యకలాపాలు నిర్వహించిన ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు 100 శాతం రీయింబర్స్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల ద్వారా 25 శాతం సబ్సిడీ చొప్పున రూ.10 లక్షలు లభించే అవకాశాలు ఉంది. వైఎస్‌ఆర్ జగనన్న బడుగు వికాసం పథకం కింద సర్వీస్, మాన్యుఫ్యాక్షరింగ్ యూనిట్ల లబ్ధిదారులకు 45 శాతం సబ్సిడీ వర్తించనుంది. ఈలెక్కన ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో అత్యధికంగా ఉన్నట్లు ఉండడం గమనార్హం. ఐదేళ్లపాటు యూనిట్‌ను కొనసాగిస్తే పెట్టుబడి మొత్తాన్ని రాయితీ రూపంలో రీయింబర్స్ చేస్తోంది. ఈలెక్కన మాన్యు ఫ్యాక్షరింగ్ యూనిట్ దారునికి సుమారు రూ.1.20 కోట్లు ప్రయోజనం చేకూరనుంది. ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో సుమారు రూ.75 లక్షల మేర ప్రయోజనం లభించనుంది. స్టాంప్‌డ్యూటీ చెల్లింపుల దగ్గర నుంచి ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల్లో 25 శాతం, కరెంటు ఛార్జీల్లో యూనిట్‌కు రూ.1.50, వడ్డీ రాయితీ కింద తొమ్మిది శాతం మేర ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. వీటితోపాటు టర్మ్‌లోన్లకు మూడు శాతం మేర గరిష్ఠంగా రూ.25 లక్షలు సబ్సిడీ లభించనుంది. ఏదేమైనా గత పరిశ్రమల పాలసీతో పోలిస్తే 2023-27 పాలసీలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల్ని పెట్టుబడికి సమానంగా సబ్సిడీ, ఇతర ప్రయోజనాల్ని ముడిపెట్టారనే విమర్శ వినిపిస్తోంది.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, తాహశీల్దార్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా రూపకల్పనకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అన్ని ఫామ్స్ ఒక్కటి కూడా పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని ఫామ్స్ క్లియర్ చేయడంలో రాజకీయ పార్టీ నాయకులు విమర్శించడానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి ముఖ్యమైనదని18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు.ఇందుకు సంబంధించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్లతో సంప్రదించి 18 ఏళ్లు నిండి వారు ఇంకా ఓటర్‌గా నమోదు చేసుకోకుంటే అలాంటి వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చూడాలన్నారు.నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వందశాతం నమోదు కావాలన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు కేవలం నాలుగైదు నెలలు మాత్రమే సమయం ఉన్నందున ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకొని విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో 2024 సంవత్సరం ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

పక్కాగా అభ్యంతరాల పరిశీలన

జిల్లాలో ఓటర్ జాబితాకు సంబంధించి అభ్యంతరాలను పక్కాగా పరిశీలన చేస్తున్నామని కలెక్టర్ గిరీష తెలిపారు. జిల్లాలో ఎస్ఎస్ఆర్ 2024 ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాకు సంబంధించి అభ్యంతరాలన్నీ పక్కాగా పెండింగ్ లేకుండా పరిశీలన చేయాలన్నారు. డెత్, షిఫ్టెడ్, రిపీటెడ్ ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసి స్వఛమైన ఓటర్ జాబితా రూపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో నాలుగు పోలింగ్ స్టేషన్‌లు చేర్పులు మార్పులు చేయాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పీలేరు నియోజకవర్గంలో రెండు పోలింగ్ స్టేషన్‌లు మార్చాలని కలెక్టర్ కు తెలుపుగా ఇవన్నీ ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు మాత్రమే పరిశీలన చేసి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఓటర్ జాబితాలో డబుల్ ఎంట్రీ, డెత్ ఓటర్లను మరొకసారి పరిశీలించాలని కలెక్టర్కు తెలుపగా తప్పకుండా పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ చర్చించి పలు సందేహాలకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆయా నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం : కలెక్టర్

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-చిన్నమండెం(రాయచోటి)

ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం అందించేలా ప్రభుత్వం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ గిరీష తెలిపారు. శుక్రవారం చిన్నమండెం ఎఆర్ కల్యాణ మండపం ఆవరణంలో కలెక్టర్ అధ్యక్షతన మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం లబ్ధి అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో చిన్న చిన్న అంశాలు ఏవైనా జిల్లా అధికారుల దృష్టికి రానివి జిల్లా కేంద్రానికి రాలేని వారి కొరకు మండల స్థాయిలోనే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధ, శుక్రవారం నాడు ఒక్కొక్క మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, మండల అధికారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున ప్రజలకు అవసరమైన అన్ని సేవలు సులభంగా అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. మండల స్థాయిలో వచ్చిన స్థానిక సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపే అవకాశం ఉందని, సచివాలయాల పరిధిలో కూడా ఏవైనా పరిష్కారం కాని సమస్యలు ఉంటే మండల స్థాయి స్పందన కార్యక్రమంలో తెలియ జేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ గిరీష, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి అర్జీలు స్వీకరించి పరిష్కారం కొరకు వాటిని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు ఎండార్స్ చేసి సత్వరం పరిష్కరించాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తంగా 97 దరఖాస్తులు అందాయి. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా కాల పరిమితిలోపు నాణ్యతగా పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు నాయక్, ఎంపిడిఒ సురేష్ బాబు, సర్పంచ్ అమీరాభి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

గుడి జాగా..వేసేయ్ పాగా

- రెవెన్యూ నిర్లక్ష్యంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ఉన్నతాధికారులు ఆదేశించినా పట్టని క్షేత్రస్థాయి సిబ్బంది

గుడి స్థలంలో వెలసిన అక్రమ కట్టడం

ప్రజాశక్తి-పీలేరు

కబ్జాకు కాదేదీ అనర్హం అంటూ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పీలేరు పట్టణ శివారులో గుడి కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కబ్జాదారులు వదలడం లేదు. కబ్జా స్థలంలో ఒక్క రోజులోనే గోడలు వెలిశాయి. మరుసటి రోజు మౌల్డింగ్ కోసం సెంట్రింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయంగా స్థానికులు సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో కబ్జాదారుల ఆటలు సాగుతున్నాయి. మండలంలోని బోడుమల్లువారిపల్లి పంచాయతీ, వినాయక నగర్లో శ్రీసీతారాముల ఆలయ నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరి 5న అప్పటి పీలేరు మండల తహశీల్దార్ సర్వే నెంబర్:137/ఏలో 6 సెంట్ల స్థలం కేటాయించారు. ఆ స్థలంపై కన్నుపడ్డ ఓ వ్యక్తి నకలీ పట్టా సృష్టించి ఆ జాగా తనదేనంటూ అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డాడని ఆలయ పెద్దలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దారుకు తాము ఫిర్యాదు చేశామని, చర్యలకు తమ సిబ్బందిని ఆదేశించినా వారు తగిన రీతిలో స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా తగిన చర్యలు తీసుకుని కబ్జాకు గురవుతూన్న ఆలయ స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

ప్రజల సొమ్ము గోల్‌మాల్?

- గృహ నిర్మాణ అనుమతుల్లో భారీగా అవకతవకలు
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి-నందలూరు

మండలం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో ప్రజల సొమ్ము గోల్‌మాల్ కావడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం ఎంతో మంది పంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. కానీ గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి, కీలక ప్రజాప్రతినిధి అర్జీదారుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి వాటాలుగా పంచుకొని నకిలీ అనుమతి పత్రాలు మంజూరు చేయడం ఈ విషయం తెలియని బాధితులు ఆ ధ్రువపత్రాలను బ్యాంకులకు ఇతర ప్రయివేట్ సంస్థలకు రుణాల మంజూరు కోసం సమర్పించారు. సదరు పత్రాలను పరిశీలించిన బ్యాంక్ అధికారులు ప్రయివేట్ సంస్థలు అవి నకిలీవిగా తేల్చడంతో అర్జీదారులు నిశ్చేష్టులైనారు. పంచాయతీలో ఇటీవల స్థల నివేషణ కోసం కొంత మంది వేసిన ప్లాట్లను అమ్ముకోనీయకుండా సవాలక్ష కొర్రీలు పెట్టి అధికారి తోపాటు ప్రజాప్రతినిధులకు లక్షల రూపాయల్లో సొమ్ము అందిన తర్వాత యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా అమ్ముకోవడానికి అనుగ్రహించారు. ఈ అక్రమాలపై ప్రశ్నించిన సదరు కొత్త అధికారిని ఆగమేగాలపై బదిలీ చేస్తున్నారు. ఇప్పటికైనా పైఅధికారులు ఈ అవినీతి అక్రమాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

గ్రామ సచివాలయం

మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ అభివృద్ధే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలసి పర్యటించారు. స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీ, కోనేటివీధి, సిఎ మహాల్, నాయక్‌వీధి, హసన్‌ఖాన్‌వీధి, ఐఎవై కాలనీ, నమాజ్‌కట్టవీధి, బండమకాన్‌వీధి, పునుగుపల్లి ప్రాంతాల్లోని మసీదులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని 9 మసీదులకు రూ.37 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. వాయల్పాడు మండలం తల్లి లాంటిదని, తమ సొంత మండలం సదుంతో సమానంగా వాయల్పాడును అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో పూలచాదర్‌ను సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, నాయకులు కరీముల్లా, సహదేవరెడ్డి, హబీబ్‌బాషా, హుమయూన్, నిర్మల, గంగులమ్మ, శివానందరెడ్డి, అబ్దుల్ కలీమ్, కేశవరెడ్డి, నీళ్లభాస్కర్, మహబూబ్‌బాషా, సాధిక్, షాహెద్, ఆఘామొహియుద్దీన్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ధోరణి మార్చుకోని రాజంపేట ఆర్‌టిసి

- వృత్తిపరమైన ఒత్తిళ్లతో ఐసియులో డ్రైవర్ చంద్ర
- సిఐ కారణమంటూ బంధువుల ఆరోపణ
- డిఎం కార్యాలయం వద్ద ధర్నా

డ్రైవర్ చంద్ర బంధువులతో మాట్లాడుతున్న డిఎం రమణయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

డివిజన్ కేంద్రమైన రాజంపేట ఆర్‌టిసిలో మౌలిక వసతుల కల్పన సమస్యలతో పాటు పాలనాపరమైన సమస్యలు కూడా అనాదిగా వేధిస్తూనే ఉన్నాయి. అధికారులు, కార్మికుల మధ్య సమన్వయ లోపంతో వివాదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఆర్‌టిసి యాజమాన్య ధోరణి పట్ల కార్మిక యూనియన్ సంఘాలు, ప్రయాణికులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ, పత్రికలలో కథనాలు వెలువడినప్పటికీ ఆర్‌టిసి యాజమాన్యం ధోరణి ఏమాత్రం మారలేదని ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణీకులు పేర్కొంటున్నారు. రాజంపేట ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పోలి చంద్ర కొంతకాలంగా అనారోగ్యంతో ఉండడంతో సెలవు కావాలని ఎన్ని మార్లు అడిగినా సెలవు మంజూరు చేయకుండా విధులు అప్పజెపుతూనే ఉండడంతో 27వ తేదీన బస్సు నడుపుతూ తీవ్ర శ్వాసకోస సమస్యకు లోనయ్యారు. బంధుమిత్రుల సాయంతో రైల్వేకోడూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొంది వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జబ్బు పడిన సమయంలో కూడా సెలవు మంజూరు చేయకపోవడంతోనే చంద్ర ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని చంద్ర బంధువులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై శుక్రవారం డిపో మేనేజర్ కార్యాలయం వద్ద చంద్ర బంధువులు ధర్నా చేపట్టారు. డిఎం వైఖరికి నిరసన తెలుపుతూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో సంస్థ డ్రైవర్ మూడు రోజుల నుంచి చికిత్స పొందుతుంటే ఆర్‌టిసి యాజమాన్యం కనీసం పలకరించిన పాపాన పోలేదని పేర్కొన్నారు. అనంతరం డిపో మేనేజర్ రమణయ్య ధర్నా చేపట్టిన వారితోనూ, యూనియన్ నాయకులు, సిఐతోనూ సమావేశమై చర్చించారు. ఈ చర్చలలో సిఐ మాధవిలత నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె నిర్లక్ష్యం కారణంగానే చంద్ర తీవ్ర అనారోగ్య బారిన పడ్డాడని, సెలవు కావాలని పలుమార్లు వేడుకున్నా నిర్లక్ష్యం చేశారని బంధువులు ఆరోపించారు. సిఐ మాధవిలతను వెంటనే సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఆర్ఎం కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందా శ్రీనివాసులు, వెంకటేష్, జడ శివ, బి.సుబ్బయ్య, ఆదెయ్య పాల్గొన్నారు. ఆర్‌టిసి డ్రైవర్ చంద్రకు జరిగిన నిర్లక్ష్యంపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ రమణయ్య తెలిపారు.

ఆటో, టాక్సీ వృత్తికి గౌరవం పెరిగింది

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ఆటో, టాక్సీ వృత్తినే నమ్ముకున్న పేద బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిసూత సమాజంలో గౌరవాన్ని కూడా పెంచుతోందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ విద్యాధరిపురం బహిరంగ సభ నుంచి 'వైఎస్ఆర్ వాహన మిత్ర' 5వ ఏడాది లబ్ధి మొత్తాన్ని. వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. కలెక్టరేట్ లోని స్పందన హాల్ నుంచి కలెక్టర్ గిరీష, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు. సిఎం వీడియో కాన్ఫిరెన్సు ముగిసిన అనంతరం జిల్లా రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో"వైఎస్ఆర్ వాహన మిత్ర' ద్వారా ఈ ఏడాది జిల్లాలో లబ్ధి పొందిన 7999 మంది లబ్దిదారులకు రూ.7.99 కోట్లు మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి డిఆర్‌ఒ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో, క్యాబ్, ట్యాక్సీలు నడుపుకుని జీవించే పేద డ్రైవర్లకు 'వైఎస్ఆర్ వాహన మిత్ర' పథకం ద్వారా ఆర్థిక భద్రత కల్పించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. వాహనాల ఫిట్‌నెస్, బీమా, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ప్రతి ఏటా లబ్దిదారులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందుతోందన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి పి.దినేష్ చంద్ర, రాయచోటి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ విజయభాస్కర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఆటో, మ్యాక్సీ, క్యాబ్‌ల ద్వారా ఎంతో మందిని వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తున్న డ్రైవర్ల సంక్షేమం కోసమే వైయస్సార్ వాహన మిత్ర పథకాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు.

ఒఎన్‌జిసి శాస్త్రవేత్తలు వైవీయూ సందర్శన

కడప అర్బన్ : ఆయిల్ అండ్ నాచ్యురల్ గ్యాస్ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు కడప బేసిన్‌లోని సహజవాయు నిక్షేపాల అన్వేషణలో భాగంగా వైవీయూ జియాలజీ విభాగపు ఆచార్యులు ఆహ్వానం మేరకు యూనివర్శిటీకి వచ్చారు. విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వెంకట సుబ్బయ్య , ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇలాంటి పరిచయాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు విద్యార్థులతో ముఖాముఖీ చర్చించారు. భూగర్భ శాస్త్రంలో ఉన్న అవకాశాల గురించి వివరించారు. వారు ప్రస్తుతం చేస్తున్న అన్వేషణ గురించి చెప్పారు. కార్యక్రమంలో జియోలజీ విభాగాధిపతి ఆచార్య రఘు బాబు, ఆచార్య సునీత, ఆచార్య జయరాజు, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, సిద్ధిరాజు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కేసులకు, జైళ్లకు భయపడేది లేదు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన నంద్యాలలో శనివారం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించబోతున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం నంద్యాలకు వెళుతూ కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ టిడిపి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల టిడిపి అమరావతి ప్రధాన కార్యాలయంలో పొలిటికల్ యాక్షన్ కమిటీని నియమించామని పేర్కొన్నారు. మొదటి సమావేశం అమరావతిలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశాలు జనసేనతో కలిసి అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. బాబుపై అక్రమ కేసులు పెట్టి సిఎం జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందంతో ఉన్నారని విమర్శించారు. ఉగ్రవాది కంటే ఘోరంగా బాబుని అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన చోటే సమావేశం ఏర్పాటు చేసి కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నామని పేర్కొన్నారు. సిఎం మతిస్థిమితం లేని వాడిగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఆధారాలు, సాక్షాధారాలు ఉంటే చూపించమంటే ఇంతవరకు చూపించలేదని ఎద్దేవా చేశారు. సిఐడి అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు సూటిగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పేరుతో లోకేష్‌ను అరెస్టు చేసేందుకు జగన్ సిద్ధమయ్యారని పేర్కొన్నారు. అక్రమ కేసులకు జైళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి కడప జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బిటెక్ రవి, పుత్తా నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప ఇన్‌ఛార్జులు పుట్టా సుధాకర్ యాదవ్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాధవి, నాయకులు సిఎం సురేష్‌నాయుడు, లక్ష్మిరెడ్డి, వికాస్ హరికృష్ణ, టిడిపి మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను తొలగింపజేస్తున్న పోలీస్ సిబ్బంది

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా నిమ్మనపల్లి తవళం రోడ్డులో ఎస్ఐ రామకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీస్ సిబ్బంది జెసిబి సాయంతో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిమ్మనపల్లి నుంచి తవళం వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో, వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జెసిబి సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్డు భద్రతా చర్యలను చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని అన్నారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి రికార్డులను కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రయాణికులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించి సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న మలుపులల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడ్ చేయరాదని సూచించారు. రోడ్డు భద్రతా నియ మాలను పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో ఆదివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ హైదర్‌వలీ తెలిపారు. మండల అధికారులు ఎంపిడిఒ టీమ్, తహశీల్దార్ టీమ్‌గా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. తహశీల్దార్ టీమ్‌లో ఇఒపిఆర్‌డిలు, మండల మెడికల్ ఆఫీసర్, ఎంపిడిఒ టీమ్‌లో ఆర్ఐ మెడికల్ ఆఫీసర్ ఉంటారని చెప్పారు. తహశీల్దార్ టీమ్ 30 న కొత్తపల్లి, అక్టోబర్ 6న కుమ్మరిపల్లి, 9న వెంకట రెడ్డి గారిపల్లె, 11న వెంకట్ రెడ్డిగారిపల్లె,16న చిట్లూరు, 20న పప్పిరెడ్డిగారిపల్లె, 26న రాచపల్లి, 30న సరస్వతిపల్లెలో నిర్వహించే ఆరోగ్య సుంక్షలో పాల్గొం టారని చెప్పారు. ఎంపిడిఒ టీమ్ 3న గువ్వలచెరువు, 9న గోపగు డిపల్లి, 13న సూర్యనారాయణపురం, 18న నీలకంఠరావుపేట, 24న బయ్యారెడ్డిగారిపల్లి, 28న కల్పనాయునిచెరువులో ఆయా గ్రామాల్లోని విలేజ్ హెల్త్ సెంటర్‌లో రోగ్య పరీక్షలను పర్యవేక్షిస్తారని తెలిపారు. గ్రామ పంచా యతీలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

కర్ణపు విశ్వనాథరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లిలో శనివారం ఆ గ్రామ సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీష్ హాజరవు తున్నట్టు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని ఆయన కోరారు.

నేడు పూలికుంటలో..

గాలివీడు : మండలంలోని పూలికుంటలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. గ్రామాల వారిగా మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలలో అక్టోబర్ 25న రెండు టీమ్‌లుగా కార్యక్రమానికి నలుగురు వైద్య సిబ్బంది హాజరవుతారని అన్నారు.

మహిళలకు రక్షణ లేదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో మహిళలకు, యువతులకు రక్షణ లేదని డిఆర్‌డిఎ మాజీ రాష్ట్ర అధికారి యల్లటూరు శ్రీనివాసరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు లోని మారుమూల గ్రామంలో ఇంటర్ చదువుతున్న 18 సంవత్సరాల ఆడబిడ్డ అదృశ్యమవడంతో తల్లి దండ్రులు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకున్నా ఇప్పట వరకు న్యాయం జరగలేదని అన్నారు. విజయనగరం జిల్లా లోతుగడ్డలో దళిత యువతిపై సామూహిక అత్యాచారం ఘటన కూడా కలచివేసిందని ఆవేదన చెందారు. రాష్ట్రంలో ఆడబిడ్డల అదృశ్యం పట్ల మాట్లాడగానే ఆహాకా రాలు చేసిన పాలకపక్షం, మహిళా కమిషన్ రాష్ట్రంలో నమోదవుతున్న అత్యా చారాలు, హత్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. అను మానా స్పద మృతి అంటూ పోలీసులు జరిగిన దురాగతం తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలు, మహిళలకు రక్షణ కరువైందని, గొప్పలు చెప్పుకునే దిశా చట్టం కూడా అభాసు పాలవుతోందని ఆరోపించారు. కఠినంగా వ్యవహరించే పోలీ సులను కూడా పాలక పక్షం చేతులు కట్టేస్తోందన్నారు. మహిళల రక్షణ పట్ల పాలకపక్షానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జరిగిన రెండు ఘటనలపై విచారణ చేపట్టి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు.

నేడు ప్రభుత్వ విప్ రాక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరవుతున్నట్లు ఎంపిడిఒ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలలో జగనన్న సురక్ష కార్యక్రమానికి మండల పరిధిలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారధులు, మండల అధికారులు హాజరు కావాలన్నారు.

సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నా మట్టి..నాదేశం ర్యాలీలో అధికారులు, మహిళలు

సైనికుల ప్రాణత్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించు కోవాలని ఎపి టూరిజం డైరెక్టర్, వైసిపి మండల కన్వీనర్ వత్తలూరు సాయి కిషోర్‌రెడ్డి అన్నారు. మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టిని అమృత కలశం ద్వారా ఢిల్లీకి పంపే కార్యక్రమం ఓబుల వారిపల్లి మండల కార్యాలయంలో ఘనంగా జరిగింది. దేశ రక్షణలో భాగంగా సేవలందిస్తున్న వీర సైని కులకు మద్దతుగా అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘ మహిళలతో ఉన్నతా ధికారులు, నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన ప్పటి నుంచి మన దేశ రక్షణలో ఎంతోమంది సైనికులు ప్రాణత్యాగం చేసి అమరులైనారని అన్నారు. ప్రశాంతంగా జీవిస్తున్నామంటే దేశ సరిహద్దులలో సైనికులు ఎటువంటి వాతావరణ పరిస్థితులలో అయినా సేవలు అందించడం వల్లే సాధ్యమైందని అన్నారు. భారతదేశంలోని ప్రతి గ్రామం నుంచి సేకరిం చిన మట్టిని కలశాల ద్వారా ఢిల్లీకి చేర్చి అమృత స్థూపాన్ని నిర్మిస్తుందని అన్నారు. మండలంలోని గ్రామా లలో సేకరించిన మట్టి కలశాన్ని ఎంపిపి చీర్ల నాగమ్మ, ఎంపిడిఒ విజయ రావు, ఐసిడిఎస్ సిడిపిఒ టి.పి.సౌభాగ్యమ్మ, సర్పంచ్‌లు జైపాల్ రెడ్డి చేతుల మీదుగా గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారథికి అందించారు. మండలాలలో సేకరించిన మట్టి కలశాలను కడపకు చేర్చి యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర కడప వారి ద్వారా ఢిల్లీకి కలశాలను చేరుస్తారని తెలిపారు. కార్యక్ర మంలో నారాయణరెడ్డి, ఎపిఒ అర్ముగం, దామోదర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు అంగన్వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘ మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'కళ్లకలక' బారిన పడుతున్న ప్రజలు

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో కళ్లకలక వ్యాధి మెల్లగా విస్తరిస్తోంది. గత నెల రోజుల నుంచి బి.కొత్తకోట పట్టణంలో చాలామంది ప్రజలకు కళ్ళు ఎర్రబారడం, నొప్పితో బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయి స్తున్నారు. రోజురోజుకి రోగులు సంఖ్య పెరుగు తుండ డంతో కళ్లకు సంబంధించిన మెడ్రాస్ఐ వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. కళ్ళు ఎరుపెక్కి మంటలు వస్తే తక్షణం ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించు కోవాలని వైద్యులు సూచించారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, పిల్లలకు కళ్ల కలక వచ్చినప్పుడు పాఠశాలలకు పంపకూడదన్నారు. పిల్లలు స్కూలుకు పంపడం వల్ల చుట్టు పక్కన విద్యార్థులకు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. వ్యాప్తిచెందకుండా సకాలంలో చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వాతావరణంలో మార్పులతోపాటు బ్యాక్టీరియా, వైరస్ లాంటివి వ్యాప్తి చెందుతున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చేతులు శుభ్రం చేసుకుని తగు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పాఠశాల పిల్లలు ఎక్కువుగా కళ్లక లక బారినపడుతు న్నారు. కళ్లకలక వచ్చిన పిల్లలను పాఠశాలకు పంపకూడదు. తల్లిదం డ్రులు వైద్యుల సూచనల మేరకు ఐడ్రాప్స్‌ను వాడాలి. తగ్గేంతవరకు ఇంటి వద్ద ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి.

-డాక్టర్ అరీఫ్, ప్రభుత్వాసుపత్రి వైద్యులు

జిపిఎస్‌తో ఉద్యోగులకు అన్యాయం : ఫ్యాప్టో

బి.కొత్తకోట : ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

బి.కొత్తకోట : జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట శుక్రవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ అనేది పెనుము మీద కాలుతుంటే జిపిఎస్ అనే పొయ్యిలోకి ఉద్యోగస్తులను ప్రభుత్వం నెట్టుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్ రెడ్డి భాస్కర్‌రెడ్డి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు నీలేష్,ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి,శైలజ,సుజాత వెంకటరమణారెడ్డి, గిరీష్, గోవిందరెడ్డి, సోమశేఖర్, ప్రభాకర్, రెడ్డిప్రసాద్, రామాంజులు, నాగరాజు, శంకరలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఉద్యోగస్తులకు తమ ప్రభుత్వం వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానని నాలుగు సంవత్సరాల తర్వాత అసెంబ్లీలో జిపిఎస్ తీసుకొచ్చి ఉద్యోగస్తుల్ని నిట్టనిలువునా మోసం చేశారని సిఐటియు జిల్లా అధ్యక్షులు, సి. హెచ్ చంద్రశేఖర్, చిట్వేలి రవికుమార్ విమర్శించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్మెంట్ తర్వాత ఇచ్చే పింఛన్, కాంట్రిబ్యూటీ పెన్షన్ వల్ల దాదాపు నాలుగు లక్షల మంది ఉద్యోగుల నష్టపోతారని తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ ఒపిసి అమలు చేస్తే రాష్ట్రం దివాలా తీస్తుందని శాసనసభలో ప్రకటించడం అన్యాయమన్నారు. శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో ఏకపక్షంగా మూజవాని ఓటుతో జిపిఎస్‌కు ఆమోదం తెలిపారని అన్నారు. శాసన మండలిలో సిపిఎం తరపున పిడిఎఫ్ ఎమ్మెల్సీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకోవడం జరిగిందన్నారు. అయినా ముఖ్యమంత్రి హామీన అమలు చేయకుండా, ఏకపక్షంగా ఆమోదించడం శోచనీయమన్నారు.

ఆర్‌టిసి డిపో పునఃప్రారంభానికి చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఆర్‌టిసి, దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బి.కొత్తకోట ఆర్‌టిసి డిపోను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు ఖలీల్‌అహ్మద్ ఇంటిలో కడపజిల్లా జోనర్ డిపిటిఒ రాముడు, ఆర్‌టిసి ఎఇ ఎన్.వెంకటరమణ, దేవాదాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. పట్టణంలోని బిసికాలనీ సమీపంలోని గంగమ్మమన్యంలో డిపోను ప్రారంభిం చడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. పుంగనూరు ఆర్‌టిసి డిపో మొదలైన తర్వాత బి.కొత్తకోట డిపోపై యాజమాన్యం దృష్టి మళ్లిందన్నారు. శాశ్వతంగా డిపోకు భవనాన్ని కట్టడానికి స్థానిక బెంగళూరు రోడ్డులోని దేవాదాయ శాఖకు చెందిన మన్యాన్ని అద్దెకు తీసుకోవాలని 2020 జనవరిలోనే నిర్ణయించినట్లు తెలిపారు. గంగమ్మ మాన్యంలోని పది ఎకరాల్లో ఉండగా అధిక భాగం నిరుపయోగంగా ఉన్నందున ఆర్‌టిసి డిపోను నడపవచ్చునని అధికార వర్గాలు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఆర్‌టిసి అధికారులు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో మాట్లాడటంతో సానుకూలంగా స్పందించి డిపో పనులు త్వరగా ప్రారంభం కావచ్చునని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి డిఎం వెంకట రమణారెడ్డి, కోటేశ్వరరావు, దేవాదాయ డిప్యూటీ కమిషనర్ కర్నూల్ గురుప్రసాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్, మదనపల్లి దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు ఖలీల్‌అహ్మద్, నగర పంచాయతీ కమిషనర్ మనోహర్, తహశీల్దార్ రఫీఅహ్మద్, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సురేందర్, కొండాసిద్ధార్థ, సచివాలయం కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి

పీలేరు : ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పీలేరు

భవ్యశ్రీ హత్యను ఖండిస్తూ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని చేస్తూ ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కెవిపల్లి మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు దొడ్డిసురేష్, దళిత సీనియర్ నాయకుడు ముల్లంగి చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు రక్షణ కరువైందని అన్నారు. ఒక బిసి విద్యార్థిని అతి కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేయడం చాలా బాధాకర విషయమ న్నారు. ఈ విషయంలో అధికార పార్టీ నాయకులు ఒక్కరు కూడా స్పందించక పోవడం చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఏం అన్యాయం జరిగినా బుల్లెట్ కన్నా జగనన్న ముందు ఉంటాడని మీడియా ముందు తెగ ఫోజులిస్తున్న మంత్రి రోజా ఈ సంఘటనపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఒక బిసి విద్యార్థిని అతి దారుణంగా చంపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రోజా స్పందించి భవ్యశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లి కార్జున, ఎర్రయ్య, కెవి పల్లి బాలుర వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ బాలల హక్కుల ఐక్య వేదిక కన్వీనర్ ఆవుల నరసింహులు, ఐసిడిఎస్ తంబళ్లపల్లె ప్రాజెక్టు అధికారిని సిడిపిఒ, పెద్దమండెం మండలం కలిచర్ల జడ్‌పిహెచ్ఎస్ ప్రధానో పాధ్యాయులు రామచంద్రలు పేర్కొన్నారు. కల్చర్ల జడ్‌పిహెచ్ఎస్‌లో తంబళ్లపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసుల్లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిడిపిఒ నాగవేణి మాటాడుతూ ఇలాంటి దుర్ఘటన జరగకుండా తల్లిదండ్రుల ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పోర్టు సంస్థ సిబ్బంది రెడ్డమ్మ, అనిత, భువనేశ్వరి, మధుబాల, అంగన్వాడీ సూపర్వైజర్లు, కళావతమ్మ, నజియాబేగం, నాగలక్ష్మి ,అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి : టిడిపి

పజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం రాజంపేట మండలం హత్యరాల గ్రామంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులతో కలిసి నల్ల దుస్తులు ధరించి నల్లబెలూన్లు చేతబట్టి వినూత్నంగా నిరసన చేపట్టారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. సిఎం డౌన్ డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు శంకరయ్యనాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ శివప్రసాద్‌నాయుడు, రోహిత్‌చౌదరి, సుబ్రహ్మణ్యం, శివ, ప్రసాద్, వెంకటరమణ, ఊటుకూరు ఉప మండలాధ్యక్షుడు సతీష్ కుమార్, తులసి నాగేంద్ర, వెంకటేష్, రామ్మోహన్, సూర్యనారాయణ, జీవి సుబ్బరాజు, శివ, శశి, గుణ, శవన కిషోర్, టిడిపి కార్యకర్తులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు. **రామాపురం:** టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కుమ్మరపల్లె గ్రామం సురకవాండ్లపల్లెలో బాబుతో నేను అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ పొడిగింపు చేయడం దురదృష్టకరమన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదని కేవలం సిఎం జగన్ పైశాచిక ఆనందం కోసమే కేసులు పెట్టారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని టిడిపి అధికారంలోకి వస్తే వైసిపి అక్రమాలకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.వచ్చే ఎన్నికల్లో టిడిపిదే అధికారమని, వైసిపి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్య క్రమంలో రామాపురం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ చింతపించల రామకృష్ణగౌడ్, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, రాజా, రాంమనోహర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధా కర్‌రెడ్డి, చిన్నకృష్ణ, ఆంజనేయులు, సుబ్బయ్య, జయరాం, చెన్నారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మిలాదున్ నబీ ర్యాలీ

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మిలాదున్ నబీ వేడుకలు రెండవరోజు మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మతపెద్దలతో కలిసి ముస్లిము సోదరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.స్థానిక చౌక్ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చౌక్ మస్జిద్ నుంచి ప్రారంభమై బైపాస్ రోడ్డు రంగసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డు, స్థానిక జామియా మజీద్ దర్గా వీధులగుండా నిర్వహించారు. ఈ ర్యాలీలో మిఠాయిలు పంచుతూ పచ్చని జండాలతో రెపరెపలాడుతూ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో నడవాలని నినాదాలు చేశారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని చౌక్ మస్జిద్ పెద్దలు ముస్లిం సోదర,సోదరీమణులందరికీ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం,మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహెూన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని కొనియాడారు. మిలాద్ ఉన్ నబీ చెడును వీడనాడి మనిషిని సన్మార్గంలో నడిపించేవి మహమ్మద్ ప్రవక్త బోధనలు అన్నారు.

కలకడ : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి క్రీడలకు కోన హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-కలకడ

రాష్ట్రస్థాయి పోటీలకు కోన హైస్కూల్ విద్యార్థుల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చంగల్ రాయులు తెలిపారు.ఇటీవల బిఎన్ కండ్రిగలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఆరుగురు విద్యార్థులు హ్యాండ్‌బాల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-17 విభాగంలోఫర్హానా, సబీనా, యోగేశ్వర్ అండర్-14 విభాగంలో జైనబ్,సమీరా, సాయినాథ్, అర్హత సాధించారని అన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో తెనాలి, శ్రీకాకుళంలో జరిగే పోటీలలో పాల్గొనాల్సి ఉందనానరు. వీరికి శిక్షణ ఇచ్చిన పిఇటి ఝాన్సీరాణిని, విద్యార్థులను అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఇందు ఎంపిక

రామసముద్రం : రామసముద్రం మండలం అరికెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.ఇందు స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా దుర్గసముద్రం పాఠశాలలో ఈ నెల 27న జరిగిన అండర్-17 జిల్లా స్థాయి విభాగంలో ప్రత్యేక ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురునాథం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు వంశీ, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

ములకలచెరువు సిఐగా తమ్మిశెట్టి మధు

ప్రజాశక్తి-ములకలచెరువు

సిఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న తమ్మిశెట్టి మధు

ములకలచెరువు సిఐగా తమ్మిశెట్టి మధు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ సాధిక్‌ఆలీ జిల్లా కేంద్రం రాయచోటి ఎస్‌పి కార్యాలయానికి బదిలీ కాగా, అనంత పురం జిల్లా కదిరిటౌన్ సిఐగా పని చేస్తున్న తమ్మిశెట్టి మధు ములకలచెరువు సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

వర్షానికి కూలిన మసీదు ప్రహరీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి సిద్దారెడ్డి గారిపల్లిలోని మసీదు వెనుక వైపున గల ప్రహరీ కూలిపోయింది. శుక్రవారం ఉదయం ఆకస్మాత్తుగా గోడకూలిపోయిందని మసీదు పెద్దలు ట్రాక్టర్ మస్తాన్, బాదుల్లా, హజరత్ బాబ్జాన్, డాక్టర్ మున్నారెడ్డి బాషాలు తెలిపారు. సుమారు రూ.5లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు వారు చెప్పారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న మసీదు ప్రతినిధులు

క్రైం కార్నర్

నాటు తుపాకులు కలిగిన నిందితుల అరెస్టు చూపుతున్న డిఎస్‌పి

రెండు నాటు తుపాకులు స్వాధీనం :డిఎస్‌పి

ప్రజాశక్తి-పీలేరు

రెండు నాటు తుపాకులతో సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం పీలేరు అర్బన్ సిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడారు. మండల పరిధిలోని రేగళ్ల పంచాయితీ, బోయపల్లికి చెందిన లింగం బాలకృష్ణ, దాసరిగంగాధరలు బోయపల్లికి పడమర దిక్కున ఉన్న పెద్దకొండకు నాటు తుపాకులతో వేటకు వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. సిఐ ఎన్.మోహన్‌రెడ్డి, ఎస్ఐ ఎంకె.నరసింహుడు తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి చేరుకుని, దాడులు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా నిందితులిద్దరూ జంతువులను వేటాడేందుకు రెండు నాటు తుపాకులతో చెట్ల మధ్య ఉండగా ఇరువురినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులు ఎలాంటి అనుమతులు, లైసెన్సులులేని రెండు నాటు తుపాకులు కలిగి ఉండగా వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఐ మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష

- ఆరుగురికి రూ.10,500 జరిమానా

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన ఐదుగురికి మూడు రోజుల జైలు శిక్ష, ఆరుగురికి రూ.10,500లు జరిమానా విధిస్తూ రాయచోటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్ఎంటికె.శారద శుక్రవారం తీర్పునిచ్చారు. రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ మొహమ్మద్‌రఫీ తెలిపిన వివరాల మేరకు ఎస్‌పి ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ ప్రధానమైన కూడళ్లలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. పట్టుబడిన 11 మందిపై కేసు నమోదు చేసి రాయచోటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరచగా వారికి జైలుశిక్షతో పాటు జరిమానాలు విధించినట్లు తెలిపారు. వాహనాదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని అరవీడు పంచాయతీ గాండ్లపల్లి సమీపంలోని చెట్ల కింద పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,400లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్ శివకుమార్ పేర్కొన్నారు. వారిని శుక్రవారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ పంపినట్లు తెలిపారు.